క్లుప్తంగా

బడి బయట విద్యార్థుల సర్వే

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, సఖిన వీడు గ్రామాల్లో శుక్రవారం బడికి వెళ్లకుండా బయట ఉన్న విద్యార్థుల సర్వే కార్యక్రమాన్ని ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న ముగ్గురు పిల్లలని గుర్తించి తిరిగి మీనవోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోకి చేర్పించారు. బడిఈడు పిల్లలను కూలీ పనులకు తీసుకెళ్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

వేంసూరు: ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కల్లూరు ఆర్డీఓ రాజేంద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం తహసీల్‌లో నిర్వహించిన బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అమలు చేయనున్న నాలుగు పథకాల డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఆర్ఐలు చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన రైతులు..

వేంసూరు: మండలంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు శుక్రవారం స్థానిక తహసీల్‌లో ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌ను కలిశారు. కల్లూరుగూడెం నిర్మించనున్న పామ్ ఆయిల్‌ఫ్యాక్టరీ రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందించాలని కల్లూరుగూడెం రైతులు ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో గురునాథరెడ్డి, గంగరాజు, గోపాలకృష్ణ, చెన్నారెడ్డి, రాంబాబు,రైతులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలను కాపాడుకోవాలి

మధిర: సంప్రదాయ నృత్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ వై.ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత అన్నారు. మధిరకు చెందిన కల్యాణపు నాగరాజు ఏర్పాటుచేసిన కళాసాధన నృత్య కళానికేతన్‌ను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కాగా, కూచిపూడి, భరతనాట్యం, జానపదం, పాశ్చాత్య నృత్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు నాగరాజు తెలిపారు. భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని గొల్లగూడెంలో ఈజీఎస్ నిధుల ద్వారా అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్ శంకుస్థాపన చేశారు. రూ. 24.55 లక్షల వ్యయంతో గొల్లగూడెంలో గుండ్ల వెంకటేశ్వర్లు ఇంటి వద్ద నుంచి ప్రాథమిక పాఠశాల వరకు సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, నరసింహా, వెంకటేశ్వర్లు, గోపయ్య, జోగారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

తల్లాడ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ .. తల్లాడ మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ, లక్ష్మి, వెంకటమ్మ, సాయమ్మ, మరియమ్మ, బాగ్యవతి, రావేలు, తిరుమలమ్మ, సీతారాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

ముదిగొండ: మండలపరిధిలోని బాణాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ట్ ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులక ప్రేరణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ప్రేరణ తరగతుల్లో మోటివేషనల్ స్పీకర్ రాణాప్రతాప్ టెక్నాలజీని ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ఊరేగింపు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేటలో నిర్మాణంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక రింగ్‌సెంటర్ నుంచి కల్పతరురోడ్డు మీదుగా అయ్యగారిపేట ఆలయం వరకు మేళతాళాలు, కోలాట నృత్యాలతో ట్రాక్టర్‌పై ధ్వజస్తంభాన్ని తరలించారు. దారిపొడవున ఇంటింటా మహిళలు నీళ్లవారపోస్తు పూజలు చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రజిని పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలి

మధిర: సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పాపినేని రామనరసయ్య, మందా సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా లేదన్నారు. దీనికితోడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతులను నిరాశపరిచాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పత్తి కొనుగోలు ప్రారంభించాలని కోరారు.

పంచ్ పడుద్ది..!



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

- కరాటే శిక్షణ.. స్వీయ రక్షణ..
- బాలికలకు పాఠశాలల్లో ప్రత్యేక తర్ఫీదు

సత్తుపల్లిటౌన్: సమాజంలో ఆకతాయిల వేధింపులు అడ్డుకునేందుకు బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రభుత్వం కరాటే శిక్షణ అందిస్తుంది. సెప్టెంబర్ నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ ఫిబ్రవరి వరకు కొనసాగుతుంది. రాణి ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్, గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు ఈ కరాటే శిక్షణ అందిస్తున్నారు. వారానికి మూడురోజులు, నెలకు 12రోజులు చొప్పున ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థినులకు కరాటే మాస్టర్లతో ఈ శిక్షణ ఇస్తున్నారు.

బాలికల్లో ఆసక్తి..

ఆత్మరక్షణ విద్యపై విద్యార్థినులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆపద సమయంలో ఆకతాయిల బారి నుంచి తమను తాము స్వీయ రక్షణకు ధైర్యం లభిస్తుంది. చదువుతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతాయి. బ్లాక్‌బెల్ట్ పొంది అనుభవం ఉన్న మాస్టర్ల ద్వారా ఈ తర్ఫీదు ఇస్తున్నారు. ఎంతోమంది విద్యార్థినులకు ఈ శిక్షణ ఉపయోగకరంగా మారింది.

కరాటేలో బ్లూబెల్ట్ సాధించా..



మా స్కూల్‌లో ఇస్తున్న కరాటే శిక్షణలో చాలా విద్యలు నేర్చుకున్నా. వైట్, ఎల్లో, ఆరెంజ్ బెల్ట్‌లతో పాటు బ్లూబెల్ట్ కూడా సాధించా. జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సెకండ్ ప్రైజ్ పొందాను. ఎక్కడ పోటీలు జరిగినా పంచ్‌లతో విజయం సాధిస్తున్నా.

– కె.ధనవర్ష, బాలికోన్నత పాఠశాల, సత్తుపల్లి

మనోధైర్యం పెరుగుతుంది..



కరాటేలో శిక్షణ తీసుకోవటం వల్ల మనోధైర్యం పెరుగుతుంది. ఈ శిక్షణ ఇప్పించటం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ విద్య ఎంతో అవసరం. ప్రస్తుతం 8వ తరగతి చదు వుతున్నా.. 7వ తరగతి నుంచే నేర్చుకుంటున్నాం.

– ఎస్‌డీ ఖాజా అఫ్రిన్,
బాలికోన్నత పాఠశాల, సత్తుపల్లి

చక్కగా నేర్చుకుంటూ..



బాలికలు కరాటే శిక్షణను చక్కగా నేర్చుకుంటున్నారు. 6 నుంచి 9వ తరగతుల బాలికలకు శిక్షణ ఇప్పిస్తున్నాం. కరాటేలో మెళకువలపై కరాటే మాస్టర్‌తో శిక్షణ, అవగాహన కల్పిస్తున్నాం. వివిధ విభాగాల్లో ఈ శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

– పి.నాగేశ్వరరావు,
బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం, సత్తుపల్లి

విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుబల్లి: మండలంలోని అడవిమల్లెల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో పాలు, గుడ్డు, ఆకుకూరలతో పాటు పండ్లు ఉండేలా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఎంపీహెచ్ఎస్ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అనురాధ, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థునులకు పరిశుభ్రత, పోషకాహారం, ప్రభుత్వ పథకాలపై సీడీపీఓ నిర్మల జ్యోతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కనకదుర్గ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, సంధ్యారాణి, సుజాత, భవాని తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో బాలబాలికలు మహనీయుల వేషధారణలో అలరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యావతి మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దాత గూడూరు కోటిరెడ్డి రూ.5వేల విలువైన నాపికిన్స్ వితరణ చేయగా, పాఠశాల సూపరిండెంట్ సరితతో కలిసి బాలికలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా గురుకులంలో వెబ్‌నార్

కొణిజర్ల: అంతర్జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం వెబ్‌నార్ నిర్వహించారు. ఐక్యూఏసీ వారి ఆధ్వర్యంలో ఎంపవర్‌మెంట్, వెల్ఫేర్ ఆఫ్ గర్ల్స్ అనే అంశంపై ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రజిత, వైస్ ప్రిన్సిపల్ నవ్య, కోఆర్డినేటర్ రజిని, కేపీ ఐశ్వర్య, పరీక్షల విభాగాధిపతి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి దయతోనే 'సీతారామ'



సీతారాముల కల్యాణ క్రతువులో పాల్గొన్న దంపతులు



మంత్రి తుమ్మలను సత్కరిస్తున్న నిర్వాహకులు

వైరా: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దయతోనే తాను మంత్రిగా ఉండి సీతారామ ప్రాజెక్ట్ కల నెరవేర్చుకోగలిగానని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వైరా శాంతినగర్‌లోని శ్రీసత్యసాయి వేద పాఠశాలలో భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ చంద్రమూర్తుల శాంతి కల్యాణం నిర్వహించగా మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. భగవంతుడి ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ అభివృద్ధి పథంలోకి సాగాలని ఆకాంక్షించారు. కాగా, కల్యాణానికి 400జంటలు హాజరయ్యాయి. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.జే.రత్నాకర్, కొరెడ్ల సూర్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు పి.వెంకటరావు, దమ్మాలపాటి సుధాకర్‌రావు, సీహెచ్.శేష సత్యకుమార్, జంధ్యాల గౌరీనాథశాస్త్రి, చంద్రశేఖర్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, చింతోజు నాగేశ్వరరావు, కన్నెదారి హనుమాయమ్మ, కుమారశర్మ, వెంకటేశ్వరరావు, అచ్యుత్ పాల్గొన్నారు.

అర్హులను జాబితాలో చేర్చండి

మధిర: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను జాబితాలో చేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి వూట్ల కొండలరావు తెలిపారు. మడుపల్లి అజయ్ భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, బ్రహ్మం, గోపి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి

బోనకల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. స్థానిక తహసీల్‌లో తహసీల్దార్ చందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పవన్, జయరాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా మంజూరు చేయాలి..

ముదిగొండ: భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మంజూరు చేయాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు వెంకయ్య, శ్రీనివాసరావు, భద్రయ్య, సతీష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి, రక్తహీనతకు గురికాకుండా రక్త పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు రాగిజావ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయదాస్ పాల్గొని మాట్లాడుతూ.. పరీక్షలు పూర్తయ్యేంతవరకు రాగిజావ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తౌరియా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లబిలో వైద్య శిబిరం

ముదిగొండ: వల్లబిలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. వల్లబి పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మేందర్ మాట్లాడారు. సందర్భంగా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న కమల్‌రాజ్

ఎర్రుపాలెం: మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకి రానున్న కాలంలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చూపాలన్నారు. అనంతరం ఎంపీ వద్దిరాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శీలం కవిత, సొసైటీ చైర్మన్ సాంబశివరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లను గౌరవించడం అందరి బాధ్యత



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు, సీఐ కిరణ్, డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే డ్రైవర్లను గౌరవించడం అందరి బాధ్యత అని సత్తుపల్లి ఎంవీఐ జేఎన్ శ్రీనివాసరావు, పట్టణ సీఐ టి.కిరణ్ అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, అధికారులు ర్యాలీ నిర్వహించి డ్రైవర్లకు గులాబీలు అందించి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులు ఎస్‌డీఐ వి.ప్రభాకర్, గఫార్, చారి, అమరనాద్, మహేందర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సూపర్‌వైజర్లు సుబ్బారావు, కాంతారావు, బాలస్వామి, సైదారెడ్డి, పద్మావతి, వివీఓ ఆనంద్, అద్దెబస్సుల యాజమాన్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ

వైరా: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని వైరా మండల వ్యవసాయాధికారి ఎంఎం ఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన వైరాలో మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటి నుంచి ప్రస్తుతం వరకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు దరకాస్తుతో పాటు ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్‌లను ఏఓ కార్యాలయంలో, క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయడం జరుగుతుందన్నారు.

అభివృద్ధిలో సత్తుపల్లి రాష్ట్రంలోనే ముందంజ



మున్సిపల్ చైర్మన్ మహేష్‌ను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

సత్తుపల్లి: కరోనావంటి విపత్కర పరిస్థితిని ఎదుర్కొని సత్తుపల్లి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ముందంజలో నిలిపామని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. ఈ నెల 27తో పాలకవర్గ పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా శుక్రవారం జరిగిన చివరి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం రింగ్ సెంటర్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.రవిబాబు, వైస్ చైర్మన్ సుజలరాణి, కౌన్సిలర్లు మౌలాలీ, ప్రసాద్, రాధిక, సలీమా ఖాతూన్, జమలమ్మ, ఉమామహేశ్వరరావు, రాంబాబు, నాగుల్‌మీరా, అనీల్, భవాని, ఛాంద్‌పాషా, రఘు, మమత, పద్మజ్యోతి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



మధిర: నిరసనలో ఆర్టీసీ కార్మికులు

మధిర/సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సు పథకాల్లో సవరణ చేయాలని కోరుతూ శుక్రవారం మధిర ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పద్మావతి మాట్లాడారు. అదే విధంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యాన నిరసన బ్యాడ్జీలతో విధులకు హాజరైయ్యారు. ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్సులు కొని నడిపే విధంగా సవరణ చేసి నిధులు సమకూర్చాలని కోరారు. కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న సబ్సిడీలు, ఇన్సెంటీవ్‌లు ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణారావు, ఎస్‌డబ్ల్యూయూ నాయకులు పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ

వేంసూరు: మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 48మంది విద్యార్థులకు బండి సుబ్బులక్ష్మి శుక్రవారం అల్పాహారం వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరువంచ హైస్కూల్‌లో..



అల్పాహారం పంపిణీని ప్రారంభిస్తున్న తోపుడుబండి సభ్యులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులకు తోపుడు బండి సూచన మేరకు దయాల కిషోర్ దత్ వేద హిమహస్త, సన్నీ కన్‌స్ట్రక్షన్స్ హైదరాబాద్ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని తోపుడుబండి ప్రతినిధి దయాల కిషోర్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్‌దత్ మాట్లాడుతూ.. పదిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఐదువేల రూపాయల నగదు బహుమతి అందిస్తామన్నారు.

విద్యార్థులకు బియ్యం, దుస్తులు పంపిణీ



బియ్యం, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు, జానకీపురం, మోటమర్రి గ్రామాల్లో హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 230మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం, దుస్తులను పాస్టర్ ఎర్నెస్ట్‌పాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ.. హోప్ స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థులకు విద్యాభ్యాసం కోసం చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. అదే విదంగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న హోప్ చారిటబుల్ ట్రస్ట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో పల్లె ప్రకృతి వనంలో నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్, చెట్లను గ్రామానికి చెందిన కొందరు తొలగించారని శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు పినపాక మాజీ వైస్ సర్పంచ్ వజ్రాల రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు, డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినట్లు రామిరెడ్డి తెలిపారు.

ఎంపీడీఓకు వినతి

కల్లూరు: మండలంలోని చెన్నూరు గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గంతోటి నాగరాజును విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు శుక్రవారం ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు లేని వారి దగ్గర, పనికిరానికి హాజరు వేసి డబ్బులు తీసుకుంటున్నాడని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్, నాగేశ్వరరావు, రాఘవులు, వెంకటేశ్వరరావు, గోపి, శ్రీను, వెంకట నాగేష్, వెంకట్య, కృష్ణ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం రూ.45లక్షల వ్యయంతో కూడిన 3 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, భీమవరంలో సబ్‌స్టేషన్‌లో రూ.8లక్షల వ్యయంతో నూతన ఫీడర్ బ్రేకర్ అమర్చారు. కార్యక్రమంలో వైరా డీఈ బండి శ్రీనివాసరావు, మధిర ఏడీఈ అనురాధ, ఏఈ గణేష్, సిబ్బంది జార్జ్, మౌలానా, రాజేష్, చక్రి తదితరులున్నారు.

తక్షణమే పీఆర్‌సీ అమలు చేయాలి



వైరాలో సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం

వైరా: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ అమలు చేసి రిటైర్డు ఉద్యోగులను ఆదుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, మేదరమెట్ల సుబ్బయ్య అన్నారు. శుక్రవారం వైరాలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలు అందించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వేణు, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య సూరి, మధిర యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, తల్లాడ, నేలకొండపల్లి అధ్యక్షులు శేషభూషణం, రంగారావు, మున్సిపల్ చైర్మన్ జైపాల్, కృష్ణారావు, వాసుదాసు, సుబ్బయ్య, శారద, వైరా ఏటీఓ ప్రసన్న, ఎస్‌టీఓ ఎల్లయ్య, ఖమ్మం ఎస్‌టీఓ యాలాద్రి, టీఎన్‌జీఓ ఖమ్మం జిల్లా అసోసియేటివ్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బోనస్ చెల్లించాలి



వేంసూరు: తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా/వేంసూరు: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం విక్రయించిన రైతులకు రూ.500 బోనస్ చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా, వేంసూరు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్లు కేవీ శ్రీనివాస్, ఎంఏ రాజు లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, నరసయ్య, మోహన్‌రావు, శ్రీనివాసరావు, పాండురంగారావు, జగన్ మోహన్ రావు, గోపాలరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా..

ఎర్రుపాలెం: రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ అయ్యవారిగూడెం సొసైటీకి చెందిన పలువురు రైతులు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఓ శివసాయి హామీ మేరకు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు శ్రీహరి నారాయణ, ధనలక్ష్మి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.